

అధ్వానంగా గ్రామీణ దారులు
మండలంలోని అంగడిచిట్టంపల్లి – లాల్‌పహాడ్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. 8లో▸



వర్షంలో తడుస్తూ..
ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు విద్యార్థులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. 8లో▸



బీమాతో ధీమా
వలసలు నివారించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధి హామీ పథకం కూలీల పాలిట వరంగా మారింది. 9లో▸

గర్భిణులకు పరీక్ష!

అల్ట్రా సౌండ్ టెస్టుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం

- మాతాశిశు ఆస్పత్రిలో మహిళల పాట్లు
- సుదూర ప్రాంతాల నుంచి నిత్యం 30 మందికి పైగా రాక
- ఉదయం 5గంటల నుంచే ఆస్పత్రి వద్ద క్యూ
- 11 గంటలకే మూత పడుతున్న స్కానింగ్ గది



తాండూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే పురుడు పోసుకోవాలి.. హై రిస్క్ కేసులకు కూడా ఇక్కడి వైద్యులు సుఖ ప్రసవం చేస్తారు.. మెరుగైన వైద్యం, ఉచితంగా మందులు, ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుంది.. ఇవీ వైద్యాధికారులు తరచూ చెప్పే మాటలు. ప్రైవేటుతో పోలిస్తే సర్కారు ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందుతున్నా ఇంకా అనేక సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. తాండూరు పట్టణంలోని మాతాశిశు ఆస్పత్రిలో గర్భిణులకు సరైన వైద్య సదుపాయాలు అందక అవస్థలు పడుతున్నారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు చేయకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణులకు సాధారణ కాన్పులు చేయడంలో తాండూరు మాతాశిశు ఆస్పత్రి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. కడుపులోని శిశువు ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలంటే అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఎంతో కీలకం. నెల రోజులుగా ఈ పరీక్షలు సరిగ్గా నిర్వహించడం లేదని గర్భిణులు ఆరోపిస్తున్నారు.అంతేకాకుండా వైద్యాధికారులు విధులకు సరిగ్గా రావడం లేదని అంటున్నారు.ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పరీక్షల నిర్వహించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి.

'ప్రైవేటు'కు పంపుతున్న వైనం

తాండూరు పట్టణంలోని మాతాశిశు కేంద్రానికి కొడంగల్, దౌల్తాబాద్, మర్పల్లి, బంట్వారం, బషీరాబాద్, యాలాల మండలాల నుంచి నిత్యం 20 నుంచి 30 మంది వరకు గర్భిణులు వస్తుంటారు. వీరిలో ఎక్కువ మంది అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షల కోసం వచ్చే వారే. మధ్యాహ్నం 2గంటల వరకు స్కానింగ్ పరీక్షలు చేయాల్సి ఉన్నా రేడియాలజిస్ట్ వైద్యుడు 11 గంటలకే పరీక్షలు ఆపేస్తున్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్కానింగ్ కోసం తెల్లవారుజామున 5 గంటలకే ఆస్పత్రికి వచ్చి క్యూలో ఉంటున్నట్లు పలువురు గర్భిణులు తెలిపారు. పది రోజులుగా స్కానింగ్ నిర్వహించే వైద్యుడు విధులకు రాకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది ప్రైవేటుగా స్కానింగ్ చేయించుకోవాలని చెబుతున్నట్లు తెలిసింది.

చర్యలు తీసుకుంటాం

నేను హైదరాబాద్ డీసీహెచ్ఎస్‌గా విధులు నిర్వహించిన సమయంలోనే ఆస్పత్రుల్లో రేడియాలజిస్ట్ సమస్య తలెత్తింది. నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసేందుకు రేడియాలజిస్ట్‌లు ముందుకు రావడం లేదు. ప్రత్యేక చొరవ తీసుకొని తాండూరు మాతాశిశు కేంద్రానికి ఇద్దరు రేడియాలజిస్టులను నియమించాం. రోజూ 25 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్. సునీత సూపరింటెండెంట్, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి

ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

- జిల్లా కన్వీనర్ నరేంద్రబాబు



అనంతగిరి: ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో, ఆధునిక సాంకేతికత కేంద్రంలో(ఏటీసీ) వివిధ కోర్సుల్లో రెండో దశ ప్రవేశాలు ప్రారంభించినట్లు జిల్లా ఐటీఐ కళాశాలల కన్వీనర్ నరేంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, సివిల్, ఎలక్ట్రా నిక్ మెకానిక్, మోటర్ మెకానిక్, కోపా, వెల్డర్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అలాగే కొత్తగా అందుబాటులోకి వచ్చిన ట్రేడ్స్‌లు సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, వర్చువల్ అనలైసిస్ అండ్ డిజైనర్, ఇండస్ట్రీస్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్లలో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. పది, ఎనిమిదవ తరగతి పాస్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆగస్టు ఒకటి నాటికి కనీసం 14 సంవత్సరాలు వయస్సు కలిగి ఉండాలని, గరిష్ట వయోపరిమితి లేదన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అభ్యర్థులు ఒకే దరఖాస్తుతో రాష్ట్రంలోని ఏదైనా ఐటీఐ, ఏటీసీకు వెబ్ ఆప్షన్ల ద్వారా ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు. ఆగస్టు ఒకటవ తేదీ సాయంత్రం 5గంటల వరకు లేదా అంతకు ముందు మీ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో ఫిజికల్ వెరిఫికేషన్‌కు అన్ని సర్టిఫికెట్లు, అప్లికేషన్ ప్రింట్ కాపీతో హాజరు కావాలన్నారు. లేకుంటే దరఖాస్తు వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉన్నట్లు చూపుతుందని, దీంతో సీటు కేటాయింపునకు అర్హులు కాదన్నారు. అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ వరకు ఐటీఐ తెలంగాణ. జీఓవి. ఇన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, మెయిల్ ఐడీ తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. రిజర్వేషన్ నిబంధనల ప్రకారం, వెబ్ ఆప్షన్ల ఆధారంగా సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. ఎంపికై న అభ్యర్థులకు రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్ సమాచారం పంపనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో లేదా సెల్ నంబర్ల 9177472488, 8555865421, 9177954208, 8500465472 సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

తాండూరు టౌన్: వికారాబాద్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం తాండూరులో జిల్లాస్థాయి జూనియర్స్ అండ్ సీనియర్స్ బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. గురువారం ఈ మేరకు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం మధు, కార్యవర్గ సభ్యుడు రాము ఒక ప్రకటన విడుదల చేశారు. తాండూరు పట్టణ శివారులోని పాత శాలివాహన డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 8గంటలకు అండర్ 14, 16, 18, 20 బాలబాలికలకు పలు విభాగాల్లో పరుగు పందెం పోటీలు ఉంటాయన్నారు. అలాగే లాంగ్ జంప్, షాట్‌పుట్ అంశాల్లో కూడా పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు వారు తెలిపారు. క్రీడాకారులు తప్పకుండా తహసీల్దార్‌చే జారీ చేసిన జనన ధ్రువీకరణ ప్రతాన్ని తీసుకు రావాలని సూచించారు.

2న కొడంగల్‌లో సన్నాహక సదస్సు



పింఛనుదారులతో ఎమ్మార్పీఎస్ నాయకులు

బొంరాస్‌పేట: పింఛన్లు పెంచాలనే డిమాండ్‌తో ఈ నెల 2న కొడంగల్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సన్నాహక సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ మాదిగ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో పింఛనుదారులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సన్నాహక సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాదిగ, మండల ఇన్‌చార్జ్ గజ్జెల ప్రకాశ్, నాయకులు గట్టిగాళ్ల ప్రశాంత్, శ్రీనివాస్, దుడ్డు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న లింగ్యానాయక్

కొడంగల్: నియోజకవర్గంలో 1,200 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్‌లో కొత్త పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తామని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లకు ఇబ్బంది లేకుండా రెండో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దీనికి అఖిల పక్ష నాయకులు అంగీకరించారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీ శ్రీనివాస్, అఖిల పక్ష నాయకులు పాల్గొన్నారు.

'కోట్‌పల్లి'కి వరద



ప్రాజెక్టులోకి చేరిన నీరు

ధారూరు: జిల్లాకే తలమానికమైన కోట్‌పల్లి ప్రాజెక్టులోకి గురువారం నాటికి నాలుగు అడుగుల మేర నీరు చేరింది. ప్రాజెక్టు మొత్తం 24 అడుగులు కాగా 8 అడుగులకు నీరు తగ్గింది. రెండు రోజులుగా కురుస్తున్న వానలకు ధర్మాపూర్, కోట్‌పల్లి వాగులు ప్రవహిస్తూ ప్రాజెక్టులోకి నీటి ఫ్లో ప్రారంభమైంది. క్రమంగా నీటి ప్రవాహం పెరుగుతూ వస్తోంది.ఇదే తరహాలో వర్షాలు పడితే ఆగస్టులోగా ప్రాజెక్టు నిండే అవకాశం ఉందని ప్రాజెక్టు ఏఈ హేమ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం

- కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు వెంకటయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్

కుల్కచర్ల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు గణపురం వెంకటయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ తెలిపారు. గురువారం కుల్కచర్లలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు జె.వెంకటయ్య ఆధ్వర్యంలో ఆయా గ్రామాల కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం కోసం.. ధర్మం కోసం పని చేసే ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదల ఆర్థిక అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. బీజేపీని గ్రామీణ ప్రాంత ప్రజలు సైతం ఆదరిస్తున్నారని తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను ఆదర్శంగా తీసుకుని స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఆంజనేయులు, దిశ కమిటీ జిల్లా సభ్యుడు జానకిరాం, మండల ప్రధాన కార్యదర్శి నరేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మైపాల్, ఓబీసీ మోర్చా నాయకుడు మహేష్, మండల ఉపాధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలు పరిగికి తెస్తాం

- రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- అన్ని హంగులతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



పరిగి పట్టణంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పరిగి: కృష్ణా జలాలను పరిగి నియోజకవర్గానికి తెచ్చి ఈ ప్రాంత భూములను శస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం పరిగి పట్టణంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రభుత్వం త్వరలో జీవో విడుదల చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమన్నారు. అన్ని హంగులతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయి విద్య అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పరిగి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎంతో తాపాత్రయ పడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద 9 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కష్టపడి చదివితే సాధించలేనిది ఏదీ లేదన్నారు. కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, డీఈఓ రేణుకాదేవి, డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం

దోమ: రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, మహిళా సంఘాల సభ్యులకు రుణ చెక్కులను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లల్లో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ వచ్చాక అర్హులందరికీ కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పరిగి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో భూమిలేని ప్రతి రైతుకూ రూ.12 వేలు ఇస్తామని పేర్కొన్నారు. దోమ మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు త్వరలో శంకుస్థాపనలు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో కృష్ణా జలాలను పరిగి నియోకవర్గానికి తెచ్చి ఇక్కడి భూములను శస్యశ్యామలం చేస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను అన్ని విధాలా మోసం చేసిందని ఆరోపించారు. అనంతరం మోత్కూర్‌లోని చెంచుకాలనీలో రూ.60లక్షల వ్యయంతో మల్టీపర్పస్ భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి పాల్గొన్నారు.

చెంచు కుటుంబాలకు పక్కా ఇళ్లు

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్
- జిల్లాకు 521 ఇళ్లు మంజూరు
- త్వరలో మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా పనులు ప్రారంభం



చెంచుల ఇళ్ల కోసం కేటాయించిన స్థలం

తాండూరు: జిల్లాలోని చెంచు కుటుంబాలకు పక్కా ఇళ్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ప్రధాన మంత్రి జన్‌మన్ మహా అభియాన్ కింద తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చెంచు కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా నుంచి 637 దరఖాస్తులు రాగా 521 మంది అర్హులని తేల్చారు. వీరికి ఇళ్లు మంజూరు చేస్తూ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దేముల్ మండలం చైతన్యనగర్ జీపీ పరిధిలో గిరిజన తెగకు చెందిన చెంచు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గతంలో ఈ గ్రామం పేరు చెంచుగుడెం కాగా ఇటీవల చైతన్యనగర్‌గా పేరు మార్చారు. ఇక్కడి వారిని విద్యా పరంగా, సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఒక్కో చెంచు కుటుంబానికి 75 చదరపు గజాల స్థలాన్ని కేటాయించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా చైతన్యనగర్ గేట్ వద్ద గల సర్వే నంబర్ 114, 115లో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఇక్కడ అన్ని వసతులతో మోడల్ కాలనీ నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. త్వరలో మంత్రి శ్రీధర్‌బాబు ఈ కాలనీ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు అధికారులు తెలిపారు. 163 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. కుల్కచర్ల మండలంలోని అనంతసాగర్ గ్రామానికి 10 ఇళ్లు, అంతారానికి 13, బండెన్కచర్లకు 28, బొంరెడ్డిపల్లికి ఒకటి, చెల్లాపూర్‌కు 25, ఘనాపూర్‌కు 50, ఇప్పాయిపల్లికి 48, కుల్కచర్లకు ఒకటి, కుసుమసముద్రంకు 14, మండిపల్‌కు 9, ముజాహిద్‌పూర్‌కు 27 ఇళ్లు మంజూరయ్యాయి. దోమ మండలంలోని మోత్కూర్‌కు 17, పుడూరు మండలంలోని మన్నెగూడకు 57, పెద్దేముల్ మండలంలోని చైతన్యనగర్‌కు 163, బషీరాబాద్ మండలంలోని నీళ్లపల్లికి 14, వికారాబాద్ మండలంలోని మదన్‌పల్లికి 32, బొంరాస్‌పేటకు 4, ఇదే మండలంలోని వడిచర్లకు 8 ఇళ్లు మంజూరయ్యాయి.

సాగుకు సరిపడా యూరియా

జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం

తాండూరు: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువు లు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం అన్నారు. జిల్లాలో ప్రస్తుత సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. గురువారం తాండూరు నియోజకవర్గం పరిధిలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు ఎంత మేరకు ఉన్నాయి.. ఎంత ధరకు విక్రయిస్తున్నారు అనే విషయాలపై ఆరా తీశారు. ఎరువులు ఎంత మేర ఉన్నాయి అనే వివరాలు బోర్డుపై రాయాలన్నారు. వర్షాలు పడుతున్న సమయంలో ఎరువులు వాడరాదని రైతులకు సూచించారు. దొడ్డు రకం యూరియా వాడితే పంటలకు అధిక సత్తువ ఇస్తుందన్నారు. ఈ విషయాన్ని ఏఓలు, ఏఈఓలు రైతులకు సూచించాలన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున పంట పొలాల్లో వర్షపునీరు నిలవకుండా చూడాలన్నారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకునేలా అవగహన కల్పించాలని తెలిపారు.



తాండూరులోని ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న అధికారులు

నాణ్యమైన భోజనం అందించాలి



వంట సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి: విద్యార్థులకు నాణ్యమైన బోధన, భోజనం అందించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. గురువారం పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల గురుకులాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆహారం తయారీలో తాజా కూరగాయలను వాడాలని తెలిపారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్కూల్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. మళ్లీ పాఠశాలను సందర్శిస్తానని అప్పటిలో సమస్యలు లేకుండా చూసుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, డీఈఓ రేణుకాదేవి, ఆర్‌డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రులపై నమ్మకం కలిగించాలి

- డీఎంహెచ్‌ఓ లలితాదేవి



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ లలితాదేవి

కుల్కచర్ల: ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించేలా వైద్యాధికారులు, సిబ్బంది పని చేయాలని డీఎంహెచ్‌ఓ లలితాదేవి సూచించారు. గురువారం కుల్కచర్లలోని ప్రభుత్వ ఆస్ప త్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్కారు దవాఖానాల్లో ప్రజలు మెరుగైన వైద్యం, సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని.. ఇట్టి విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధు లు వ్యాపించే అవకాశం ఉందని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రవీణ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందాలి

దోమ: ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.లలితాదేవి ఆదేశించారు. గురువారం దోమ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ల్యాబ్, ఫార్మసీ, ఇన్ పేషెంట్ వార్డు, డెలివరీ గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్ యాదవ్, సీహెచ్‌ఓ విజయలక్ష్మి, ఎంపీహెచ్ఈఓ ప్రభులింగం, సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

జిల్లా పంచాయతీ అధికారి జయసుధ



ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీపీఓ జయసుధ

అనంతగిరి: గ్రామ పంచాయతీ ఓటర్ జాబితా మ్యాపింగ్‌లో ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ సూచించారు.గురువారం వికారాబాద్‌లోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పంచా యతీ కార్యదర్శులు చేపడుతున్న ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు ఇచ్చారు. ఏమైన సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్,ఎంపీఓ దయానంద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తులు పరిష్కరించండి

- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్
- పరిగిలో రెవెన్యూ అధికారులతో సమావేశం


సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

పరిగి: భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చిన దరఖాస్తులపై ఎమైనా సమస్యలు, అభ్యంతరాలు ఉంటే క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలు సేకరించాలని తెలిపారు. ఇందులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కూలినా అందని 'ఇందిరమ్మ'


కేరెళ్లిలో కూలిపోయిన ఇల్లు

ధారూరు: అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని కేరెళ్లిలో బేగరి నర్సింలు ఇల్లు గతేడాదే పాక్షికంగా కూలిపోయింది. దీంతో ఆయన ఇంటిని ఖాళీ చేసి, మరోచోట ఉంటున్నారు. ఇదిలా ఉండగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బుధవారం రాత్రి నర్సింలు ఇల్లు పూర్తిగా కూలిపోయింది. కానీ ఇతనికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదు. ఇదిలా ఉండగా నివాస యోగ్యంగా లేని నర్సింలు ఇంటి నుంచి పాములు, తేళ్లు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. కూలిపోయిన ఇళ్లను కూల్చేయాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

కల్తీ కల్లు తాగి వ్యక్తి మృతి

మూసాపేట: కల్తీ కల్లు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లి, ఇందిరా హిల్స్‌కు చెందిన ఆడెబు విజయ్‌కుమార్ (35) రాపిడో బైక్ రైడర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న రాత్రి అతను సాయిచరణ్ కాలనీలో కల్లు తాగి ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత వాంతులు చేసుకోవడంతో మర్నాడు కేపీహెచ్‌బీలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు 8న గాంధీ ఆసుపత్రికి, అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు.

మోసం చేసిన యువకుడికి రిమాండ్

దోమ: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన ఓ యువకుడిని పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దతండా అనుబంధ తండాకు చెందిన లక్ష్మి(19), గోన్యానాయక్ తండాకు చెందిన కేతావత్ రాహుల్ మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. ఆ సమయంలో లక్ష్మి కారు కొనుక్కునేందుకు రాహుల్‌కు రూ.30 వేలు, మూడు తులాల బంగారం ఇచ్చింది. అనంతరం పెళ్లి చేసుకోలేనని అతడు మొహం చాటేశాడు. దీంతో మనస్తాపం చెందిన యువతి ఈ నెల 20న పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. తల్లి సోనిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా రాహుల్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

అధ్వానంగా గ్రామీణ దారులు

- గుంతలమయమైన అంగడిచిట్టంపల్లి–లాల్‌పహాడ్ రోడ్డు
- తరచూ జరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


అంగడిచిట్టంపల్లి గేటు వద్ద రహదారి దుస్థితి


గుంతలమయంగా పూడూరు రోడ్డు

పూడూరు: గ్రామీణ రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి–లాల్‌పహాడ్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. గతంలో ఇదే రహదారికి మరమ్మతులు చేసి వదిలిపెట్టారు. అనంతరం రోడ్డు పూర్తిగా ధ్వంసమైనా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా కురిసిన వర్షాలకు గుంతలు ఏర్పడి నీరు నిలిచింది. మీర్జాపూర్, పూడూరు, కంకల్, చన్గోముల్ బ్రిడ్జీలు నిర్మించి చుట్టు పక్కల గ్రావెలింగ్ చేయకుండా వదిలేశారు. ప్రధాన రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాలకు వెళ్లే రోడ్లు సైతం అధ్వానంగా మారాయి.

నాణ్యతకు తిలోదకాలు

నాసిరకంగా రోడ్లు వేయడంతో అవి మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. బీటీ రోడ్ల కోసం ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా కాంట్రాక్టర్లు నామమాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకొన్నారు. అలాగే అధికారులు మాత్రం కమీషన్లకు కక్కుర్తి పడి రహదారు వేస్తున్న ప్రాంతాలకు వెళ్లకుండానే కార్యాలయాల్లోనే బిల్లులు చేస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ గుంతలో పడతామని ఆందోళన చెందుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంగా రూ.కోట్ల నిధులు బూడిదలో పోసిన పన్నీరు అన్న చందంగా మారింది. సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో పనులు నాణ్యతగా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నివేదిక పంపాం

లాల్ పహాడ్ నుంచి కంకల్ వరకు డబుల్‌రోడ్డు పనులు జరుగుతున్నాయి. అంగడిచిట్టంపల్లి నుంచి లాల్ పహాడ్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. 14 కిలో మీటర్ల వరకు రహదారి చెడిపోయింది. రోడ్డు వేయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. డబుల్ రోడ్డు కోసం ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– మహేశ్, ఆర్అండ్‌బీ, ఏఈఈ

వర్షంలో తడుస్తూ.. నిరీక్షణ


బస్సు కోసం రోడ్డుపైన వేచి చూస్తున్న విద్యార్థులు

బస్ షెల్టర్ లేక రోడ్డుపైనే విద్యార్థులు

పూడూరు: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు విద్యార్థులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. మండల పరిధిలోని ఎన్కేపల్లి మోడల్ స్కూల్ వద్ద బస్‌షెల్టర్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సాయంత్రం పాఠశాల ముగిశాక ఇంటికి వెళ్లేటప్పుడు విద్యార్థులు వర్షంలోనే తడుస్తూ బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. మోడల్ స్కూల్‌కు వందలాది మంది విద్యార్థులు నిత్యం వస్తున్నా బస్‌షెల్టర్ లేకపోవడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పరామర్శ

దుద్యాల్: మండల పరిధిలోని లగచర్లలో బుధవారం మృతిచెందిన పగిడ్యాల అంజిలయ్య కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. పారిశ్రామిక వాడకు ఇచ్చిన భూమికి సంబంధించిన పరిహారం చెక్కు అందలేదని బాధితులు చెప్పడంతో అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, నాయకులు సురేశ్ రాజ్, నరేశ్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

అందరికీ అర్థమయ్యేలా బోధించాలి

- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి
- పరిగి నంబర్– 1 పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం


కాంప్లెక్స్ సమావేశంలో డీఈఓ రేణుకాదేవి

పరిగి: ప్రతీ విద్యార్థికి అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సూచించారు. స్థానిక నంబర్ 1 ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎన్ మూల్యాంకనంపై బేస్‌లైన్ విశ్లేషణ చేయాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్, గణితంలో విద్యార్థుల ఫలితాలపై సమగ్రంగా చర్చించాలని తెలిపారు. తరగతి గదుల్లో చిన్న గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో విద్యార్థుకుల చదవడంపై ఆసక్తి పెరుగుతుందన్నారు. చదువుదాం, చెబుదాం తరహా పఠన కార్యక్రమాలతో పిల్లల్లో భాషా సామర్థ్యాలను మెరుగు పర్చాలని ఆదేశించారు. గణితంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అకౌంటెంట్, ఏఎన్ఎంల ఎంపిక

అనంతగిరి: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అకౌంటెంట్, ఏఎన్ఎం పోస్టులకు అర్హులను ఎంపిక చేశామని డీఈఓ రేణుకాదేవి తెలిపారు. ఇందుకు సంబంధించిన జాబితా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని నోటీస్ బోర్డుపై అందుబాటులో ఉందన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే శనివారం సాయంత్రం 4గంటలలోపు కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

ఎట్టకేలకు రాకపోకలు షురూ


కాగ్నా వంతెనపై వాహనాల రాకపోకలు

దోర్నాల్–స్టేషన్‌ధారూరు వంతెనపై వాహనాల ప్రయాణం

ధారూరు: ఎట్టకేలకు మండల పరిధిలోని దోర్నాల్–స్టేషన్‌ధారూరు గ్రామాల మధ్య కాగ్నా నదిపై నిర్మించిన వంతెనపై రాకపోకలు ప్రారంభమయ్యాయి. 2017 నుంచి వంతెన నిర్మాణ పనులు ప్రారంభమై పలు దశల్లో నిలిచిపోయాయి. అప్పటి నుంచి తాత్కాలింగా వేసిన మట్టి రోడ్డుపై రాకపోకలు సాగించారు. స్థానికుల ఒత్తిడి మేరకు అధికారులు, నాయకులు మిగతా పనులు పూర్తి చేయించారు. చివర్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్ వంతెనకు ఇరువైపులా వాహనాలు వెళ్లేందుకు వీలుగా మట్టిని పోయించారు. దీంతో గురువారం నుంచి బ్రిడ్జిపై రాకపోకలు షురూ అయ్యాయి. ఎస్ఐ రాఘవేందర్ వంతెనను పరిశీలించి కాగ్నా నదిని ఎవరూ దాటకుండా కంచె వేయించి నిఘా ఏర్పాటు చేశారు.


నదిని పరిశీలిస్తున్న ఎస్ఐ రాఘవేందర్

బ్లేడుతో గొంతు కోసుకున్న వ్యక్తి

భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపం


చికిత్స పొందుతున్న రవి

తాండూరు రూరల్: భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోయిందనే మనస్తాపంతో మద్యం తాగిన ఓ వ్యక్తి బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. ఈ ఘటన తాండూరు మండలం జినుగుర్తిలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. జినుగుర్తికి చెందిన వడ్ల రవి, మహేశ్వరి దంపతులకు ఇద్దరు మగ పిల్లలు. రవి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం చిన్నపాటి విషయంలో భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె అలిగి పిల్లలతో సహా కర్ణాటక రాష్ట్రంలోని చందాపూర్‌లోని పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య రాదేమోననే అసహనంతో మద్యం తాగిన రవి గురువారం బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆతన్ని తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. ప్రస్తుతం రవి ఆరోగ్య పరిస్థితి నిలకడగ ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పైపు పగిలి.. భగీరథ నీరు వృథా


పైపు పగిలి ఎగిసి పడుతున్న నీరు

దోమ: మండలంలోని బాస్‌పల్లి, గొడుగోనిపల్లి గ్రామ సమీపంలోని కుక్కల వాగు వద్ద గురువారం మిషన్ భగీరథ పైపు పగిలి నీరు ఎగిసి పడుతోంది. దీంతో స్వచ్ఛమైన తాగు నీరు పెద్ద ఎత్తున వృథాగా పోతోంది. అటుగా వెళ్లే ప్రయాణికులకు నీరు ఎగిసి పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంబంధిత అధికారులకు విషయం తెలిసినా కనీసం చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడ్డారు.

బావిలో గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరం

పూడూరు: గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరం, బైక్ లభ్యమైన ఘటన చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం రాకంచర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడని ఫిర్యాదు అందిందని తెలిపారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వెతుకుతున్న క్రమంలో దామగుండం కోనేరు సమీపంలో అతని బైకు దొరికింది. అటవీ ప్రాంతంలోకి వెళ్లాడా..? అనే క్రమంలో వెతుకుండగా అడవిలోని ఓ పాడుబడ్డ బావిలో బైకు, అస్థిపంజరం ఉన్నట్లు గుర్తించారు. దాదాపు ఏడాది క్రితం ఈ ఘటన జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. రాకంచర్లలో తప్పిపోయిన వ్యక్తి వికారాబాద్‌లో క్షేమంగా ఉన్నాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఖాళీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

అనంతగిరి: కొడంగల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న 25 సీనియర్ రెసిడెంట్, 15 ట్యూటర్ పోస్టులను గౌరవ వేతనం పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ ఒక ప్రకటలో తెలిపారు. సీనియర్ రెసిడెంట్ పోస్టు కోసం పీజీ ఉత్తీర్ణత ఉండాలని, వీరికి గౌరవ వేతనం రూ.92,575 ఉంటుందని, ట్యూటర్ పోస్టుకు ఎంబీబీఎస్ లేదా ఎమ్మెస్సీ మెడికల్ చేసిన వారు అర్హులని, చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 28న కలెక్టరేట్‌లోని ఐడీఓసీ బ్లాక్‌లో ఉదయం నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ సుధీర్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

అనంతగిరి: గ్రామపాలనా అధికారుల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సుధీర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో అధికారులతో గ్రామపాలనా అధికారులు, లైసెన్స్ సర్వేయర్ల పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న ఆదివారం వికారాబాద్‌లోని తాండూరు రోడ్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర)లో జీపీఓ అభ్యర్థులు 83 మంది, లైసెన్స్ సర్వేయర్ల అభ్యర్థులు 139 మందికి పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. జీపీఓ, సర్వేయర్ల పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వరకు ఉంటాయన్నారు. పరీక్షకు గంట ముందే రావాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా పరీక్ష నిర్వహణ సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ నేమత్ హాలి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, దీపక్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, డీఎంహెచ్ఓ, లలితాదేవి, ఇన్‌స్పెక్టర్ భీంకుమార్, ఈడీఎం మహ్మద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోడకు కన్నం వేసి.. మద్యం చోరీ

రూ.40 వేల నగదు, నాలుగు ఫుల్ బాటిళ్ల తస్కరణ


షాపు గోడకు చేసిన రంధ్రం

యాలాల: మండల కేంద్రంలోని యాలాల వైన్స్‌లో చోరీ జరిగిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, షాపు నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న యాలాల వైన్స్‌ను ఎప్పటిలాగే గురువారం ఉదయం 10 గంటలకు తెరిచారు. షాపు లోపల గోడకు రంధ్రాన్ని గుర్తించిన నిర్వాహకులు చోరీ జరిగినట్లు గ్రహించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. బుధవారం అర్ధరాత్రి వేళ షాపు వెనుక భాగంలో గోడకు రంధ్రం చేసిన దొంగ అక్కడి నుంచి లోపలికి వచ్చాడు. గల్లాపెట్టెలో ఉన్న సుమారు రూ.40వేల నగదుతో పాటు 4 ఫుల్ బాటిళ్లను తస్కరించాడు. తాను చోరీకి పాల్పడ్డ దృశ్యాలు సీసీ కెమెరాలో ఉంటాయనే భావనతో అక్కడే ఉన్న హార్డ్ డిస్క్‌ను సైతం ఎత్తుకెళ్లాడు. ఎస్ఐ విఠల్ తన సిబ్బందితో షాపు పరిసరాలను పరిశీలించారు. నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అపరిశుభ్రంగా ఎంపీడీఓ ఆఫీస్


ఎంపీడీఓ కార్యాలయం వెనుక పెరిగిన పిచ్చిమొక్కలు

నవాబుపేట: గ్రామాలు, పట్టణాలు, నివాస ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పదేపదే సూచించే అధికారులు మాత్రం ఆ మాటలు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం చెత్తచెదారం, పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తుంది. నిత్యం ప్రజలు, అధికారులతో కిటకిటలాడే చోట అపరిశ్రుభ వాతావరణం నెలకొంది. దీంతో ఈగలు, దోమలతో పాటు విష పురుగులు సంచరించే అవకాశం లేకపోలేదు. స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచే ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


కార్యాలయం పక్కన ఇలా..

ఉద్యాన పంటలపై ఆసక్తి చూపాలి

ఉప సంచాలకులు నీరజ


మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో అధికారులు, నాయకులు

బొంరాస్‌పేట: కూరగాయలు, పండ్ల పంటలపై రైతులు ఆసక్తి చూపాలని ఉద్యానశాఖ ఉపసంచాలకులు నీరజ అన్నారు. 2025–26 ఆయిల్ పామ్ విస్తరణలో భాగంగా గురువారం మండల పరిధిలోని చౌదర్‌పల్లిలోని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి 4.5 ఎకరాల పొలంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమం ప్రారంభించారు. ఆయిల్‌పామ్ సాగులో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, సాగు విధానం, పెట్టుబడి, ఆదాయం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగు విస్తరించాలని అన్నారు. కార్యక్రమంలో డీహెచ్ఎస్ఓ సత్తార్, అధికారులు సంజయ్‌సోనీ, స్టేట్ కోఆర్డినేటర్ సురేశ్, సురేంద్రనాథ్, కమల, అక్షితరెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు.

తండ్రిని చంపిన కొడుకుకు రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు టౌన్: భూమి తన పేరుపై చేయడం లేదని, మద్యం మత్తులో కన్న తండ్రిని కొట్టి చంపిన కొడుకును తాండూరు రూరల్ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐతో నగేష్ కలిసి వివరాలు వెల్లడించారు. పెద్దేముల్ మండలం గొట్టపల్లి గ్రామానికి చెందిన తలారి హన్మంతు(75) తన మూడో కొడుకైన తలారి రవి మద్యం తాగొచ్చి భూమిని తన పేరుపై రాయాలని బలవంతం చేసే వాడు. ఈ క్రమంలో తన తండ్రిని సుత్తితో తలపై, కణతలపై కొట్టి చంపేశాడు. అనంతరం 100 నంబర్‌కు ఫోన్ చేసి తన తండ్రిని చంపినట్లు చెప్పి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం నిందితుడు రవిని పట్టుకుని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు. నిందితున్ని పట్టుకోవడంలో కృషి చేసిన పెద్దేముల్ ఎస్ఐ వేణుకుమార్, పోలీసు సిబ్బందిని రివార్డుతో సత్కరించారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

కేశంపేట: రెండు నెలల క్రితం కేశంపేట గ్రామంలో జడ్చర్ల మండలంలోని ఎక్వాయపల్లి గ్రామానికి చెందిన శివ తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కేసు నమోదు చేశాడు. పోర్టల్‌లో ట్రాక్ చేయడంతో లభ్యమైన ఫోన్‌ను గురువారం సీఐ నరహరి బాధితుడికి అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్, కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి ఉన్నారు.

అనంతగిరి.. అందాలసిరి

అనంతగిరి: ఇటీవల కురుస్తున్న ఎడతెరపి లేని వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కుంటల్లో వరద నీరు చేసుకుంది. ప్రముఖ పర్యాటక ప్రదేశమైన అనంతగిరి గుట్టలు పచ్చతోరణంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చిరు జల్లులతో కూడిన వాతావరణాన్ని ఆస్వాదించడానికి పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.

